


# సంచలన వార్తలకు నేడు

TELUGU DAILY



దులీప్ ట్రోఫీ విజేతగా ఈస్ట్ జోన్ 08

శుక్రవారం | 11.09.2026 | సంపుటి : 4 | సంచిక : 135 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



## హద్దులు ఉండాల్సిందే..

**చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీం**

న్యూఢిల్లీ : చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లలు డిజిటల్ వేదికలను సులభంగా వినియోగించే అవకాశం ఉందని, అందుకే వారికి రక్షణ కల్పించేలా హద్దులు ఉండాల్సిందేనని సూచించింది. మైనర్లు సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను వినియోగించే విషయంలో రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ వేధింపుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్ ఈ పిటిషన్ వేసింది. సోషల్ మీడియా వినియోగించే విషయంలో మైనర్లకు తగిన రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ఆటోమేటిక్‌గా కంటెంట్-ఫిల్టర్ చేసే వ్యవస్థలు

-మిగతా 2 లో..

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

## అధికారం పోయినా అహంకారం పోలేదు

**వారి కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలి**

**ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది**

**కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్రలు**

**బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం!**

**సర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండండి**

**సీఎల్పీ సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలు**

**అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే..**

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. "వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 10 : తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటు చేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహార శైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు

-మిగతా 2 లో..

## ఉద్యోగుల పక్షాన ఉంటా..

**ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తాం**

**పీఆర్సీ నివేదికను వెంటనే అందాలి**

**డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ**

**సమస్యలపై సీఎంతో జేఏసీ చర్చలు**

03



## శాసనమండలిలో నిరసనలు

**'22ఏ'పై వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష ఎమ్మెల్సీలు**

**ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ చర్చకు పట్టు...**

**వాయిదా తీర్మానం తిరస్కరించినట్లు చైర్మన్ ప్రకటన**

**నిరసనగా వాకౌట్ చేసిన బీఆర్ఎస్ సభ్యులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 :బీఆర్ఎస్ సభ్యుల నినాదాలు...నిరసన పాటలతో గురువారం శాసన మండలిలో గందరగోళం నెలకొంది. నిషేధిత భూముల (22ఏ) అంశంపై చర్చకు వాయిదా తీర్మానం ఇచ్చిన విపక్ష సభ్యులు దానిపై చర్చకు పట్టుబట్టారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ వాయిదా తీర్మానాన్ని అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పోడియం వైపు దూసుకొచ్చి నినాదాలు, నిరసన పాటలతో హోరెత్తించారు. తీర్మానం తిరస్కరిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించడంతో నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. గురువారం మండలి ప్రారంభమైన వెంటనే చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు.

-మిగతా 2 లో..

## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

**పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు**

**2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్**

**వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు**

**లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం**

**ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం**





## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

**ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల**

**796.28 ఎకరాల భూమి కేటాయింపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : తెలంగాణ రవాణా రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిష్ఠాత్మక అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు మొదటి అడుగు పడింది. హైదరాబాద్ మహా నగరాన్ని దేశంలోనే మొట్టమొదటి హైస్పీడ్ బుల్లెట్? ట్రైన్ కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బుల్లెట్? ట్రైన్? హబ్?ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరిట

-మిగతా 2 లో..

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**రూ.5 లక్షల ఉచిత సాయం..**

**తెలంగాణలోనే అమలు**

**రెండో విడతలో 59 వేల గుడిసెలకు ఇందిరమ్మ ఇళ్లు**

**ఎంపికలో డ్రాలో పారదర్శకత..**

**అనర్హులకు చోటు లేదు**

**8 లక్షల ఇళ్లకు ప్రభుత్వంపై రూ.40 వేల కోట్ల భారం**

**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ**



హైదరాబాద్, సెప్టెంబర్ 10 : పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి

-మిగతా 2 లో..

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'సంధ్యా రావు' అనే ఎక్స్ ఐడీ చేసిన ట్వీట్ ను ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో ఒక నకిలీ ఖాతా ఆధారంగా సీఎం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, అసలు ఏ రాజకీయ పార్టీకైనా 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవి ఉంటుందా

-మిగతా 2 లో..

## 90 ఎంఎల్ వేసుకుని ఫేక్ అకౌంట్ సృష్టించారా?

**'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని కాంగ్రెస్ సృష్టించింది**

**రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం**



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 92 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 119 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 184 (కిలో) |
| స్కిన్ లెస్ | 208 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

హైదరాబాద్, మార్చి 2 : క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 2026-2027 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై

-మిగతా 2 లో..



## ఈనెల 17న ఘనంగా ప్రజాపాలనా దినోత్సవం

**పబ్లిక్ గార్డెన్‌లో విస్తృత ఏర్పాట్లు చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ఏర్పాట్లపై సచివాలయంలో సిఎస్ సమీక్ష**

ఈనెల 17 వతేదీన నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

03





## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**సోషల్ మీడియా దుష్ప్రచారాలు నమ్మొద్దు**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి**

03

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని.. మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన



పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించినట్లు తెలుస్తోంది. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దేశంలో వయోజనుల జనాభా, ఓటర్ల జాబితాలో నమోదైన ఓట్ల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. అయితే ఈ అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలేనని.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తుది నిర్ణయాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. వెయ్యి రోజుల పాలనలో ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

(మొదటిపేజీ తరువాయి)



అమెరికా వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్‌జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాల ను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది. జీనోమ్ వ్యాలీతో పాటు ఐఐసీటీ, సీసీఎంబీ, నైపర్ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉండటం హైదరాబాద్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోందని నేతలు వివరించారు.

## 90 ఎంఎల్ వేసుకుని ఫేక్ అకౌంట్ సృష్టించారా?

(మొదటిపేజీ తరువాయి)

అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి కూడా అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవి ఉండదని... సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ ఏ పార్టీ చూసుకున్నా ఇలాంటి హోదా ఉండదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. అలాంటిది 'సంధ్యా రావు' అనే పేరుతో బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి అని రేవంత్ రెడ్డే కొత్త పదవిని సృష్టించారని దుయ్యబట్టారు. ఫేక్ ఐడీ పోస్టులను సృష్టించేటప్పుడు కాంగ్రెస్ నేతలు లేదా సీఎం ఏమైనా '90ఎంఎల్' వేసుకుని ఉన్నారా? అని ఘాటుగా ప్రశ్నించారు. ఈ డ్రామా వెనుక ఉన్న అసలు సూత్రధారి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్ ఐటీ సెల్ ద్వారానే 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని సృష్టించి, దాంతో తప్పుడు పోస్టులు పెట్టించి, ఆపై అదే అంశంపై రేవంత్ రెడ్డే స్వయంగా సిట్ విచారణకు ఆదేశించడం విచిత్రంగా ఉందని ధ్వజమెత్తారు.

## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

(మొదటిపేజీ తరువాయి)

(సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మెగా మల్టీ మోడల్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు. ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం శంషాబాద్-తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ పరిధిలో 796.28 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఈ ప్రక్రియ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం సేకరిస్తున్న మొత్తం స్థలంలో సర్వే నంబర్లు 28, 62 పరిధిలోని 750 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 46.28 ఎకరాలు ప్రైవేటు, పట్టా భూములుగా అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు చేపట్టరాదని రెవెన్యూ యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొంది. సీఎం రేవంత్ రెడ్డి సరిగ్గా ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఉండటం వల్ల భవిష్యత్తులో విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఈ బహదూర్‌గూడ హబ్ కేంద్రంగా హైదరాబాద్-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై (వయా అమరావతి) వంటి మూడు ప్రధాన హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ల కార్యకలాపాలను నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.

## శాసనమండలిలో నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

అయితే 22ఏ అంశంపై ఇచ్చిన వాయిదా తీర్మానం చర్చకు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, ఎల్.రమణ, దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, వాణీదేవి, నవీన్‌రావు తదితరులు వెల్‌వైపు దూసుకొచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ చర్చకు పట్టుబట్టారు. ప్లకార్డులు తీసేయాలని చైర్మన్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా వెనక్కి తగ్గలేదు. 'కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడదాం..ముఖ్యమంత్రి భూ దోపిడీ నశించాలి..సీఎం కుటుంబ సభ్యులకు కేటాయించిన భూములను రద్దు చేయాలి..22ఏ నిషేధిత భూముల అంశంపై వెంటనే చర్చ చేపట్టాలి..'అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదా లు చేశారు. వారు చైర్మన్ పోడియం వద్దకు వెళ్లకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. ఈ సమయంలో శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే సభ మర్యాద పాటిస్తూ నిబంధనలు పాటించాలని సూచించారు. మరోవైపు ప్రశ్నోత్తరాలు కొనసాగించడంతో బీఆర్ఎస్ సభ్యులు పోడియం వద్దే నిలబడి తమ నిరసన కొనసాగించారు. దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నిరసన పాట లు పాడారు. దీనికి మిగిలిన ఎమ్మెల్సీలు చ ప్పట్లతో కోరస్ ఇచ్చారు. దీంతో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది. చైర్మన్ వారించినా బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. అయినా ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.. తీన్మార్ మల్లన్న పక్క సీటులోకూర్చుని అకస్మాత్తుగా తన జేబులోంచి 'బామ్మర్దికి అమృత్ టెండర్లు, తమ్ముడికి రావిరాల భూములు.. రైజింగ్ ఎనుముల ఫ్యామిలీ'అని నినాదాలు రాసి ఉన్న కాగితాన్ని ప్రదర్శించారు. దీనిపై చైర్మన్ గుత్తా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## హద్దులు ఉండాల్సిందే..

(మొదటిపేజీ తరువాయి)

ఉండాలని, వయసు ధ్రువీకరణను అమలు చేయడంలో ప్లాట్‌ఫామ్‌లు విఫలమవుతున్నాయని ఆ సంస్థ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. అల్గారిథమ్ ఆధారిత సిఫార్సులు యువతను లైంగిక వేధింపులకు గురిచేసే, వారికి వయసుకు మించిన కంటెంట్‌ను అందిస్తాయని పేర్కొంది. 18 ఏళ్లలోపు పిల్లలు తల్లిదండ్రులు లేక సంరక్షకుల అనుమతి లేకుండా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో నిమగ్నం కాకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరింది.

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)



మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310-320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230 కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో ఈ విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తిచేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను పూర్తి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు. అసంపూర్తి ఇళ్లకు రెండో విడతలో ప్రత్యేక అవకాశం గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని, డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేదలు గుడిసెల నుంచి స్లాబ్ వేసిన ఇందిరమ్మ ఇళ్లలోకి మారేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

## పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

### సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా బిల్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** పంచాయతీల సొంత వనరుల ద్వారా వచ్చే ఆదాయం, ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చ జరిపి ఆమోదించింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా నిధులను నిర్దిష్టమైన ప్రక్రియ ద్వారా డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్సు కమిషన్ నిధులను బ్యాంకు ఖతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గ్రామపంచాయతీల కోసం ప్రతీ నెల ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచిపోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల 2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలను నిర్మిస్తున్నామని తెలిపారు. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని చెప్పారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు.

గ్రామపంచాయతీలకు సహకార బ్యాంకుల్లో నిధులు జమచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ రమణరావు, శంకర్ తదితరులు చర్చలో పాల్గొని సూచనలు ఇచ్చారు.

## రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు లక్ష లంచం

### తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి.. విచారిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు.. ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా.. అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్ఎఫ్ మంజూరు ప్రక్రియ, చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

## లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

### ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 :** గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయీ జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు. లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూయీ జెనెరిస్' మోడల్. లడఖ్‌లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుంద్రా వివరించారు. 'సూయీ జెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పరిస్థితిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైనది' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో ఆశిష్ కుంద్రా భాగస్వామిగా ఉన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దుచేసిన కేంద్రం జమ్మూ కశ్మీర్, లడఖ్‌గా విభజించి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో లడఖ్‌లోని ఒక వర్గం కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, కాలక్రమేణా అధికారుల పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. వారు రాష్ట్ర హోదాతో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆరో షెడ్యూల్ ప్రకారం భూమి, అడవులు, నీరు, వ్యవసాయంపై చట్టాలు చేసే అధికారంతో స్థానిక కౌన్సిళ్లను ఏర్పాటు చేయవచ్చు. ఇది ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో స్థానిక సమాజాలకు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని అందిస్తుంది. గతేడాది లేహ్‌లో భద్రతా బలగాలు, పౌరుల మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హింస తర్వాత సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సహా పదుల సంఖ్యలో ప్రజలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మెజారిటీ ప్రజలపై కేసులను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి

- లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక
- సాగుకు అవసరమైన సదుపాయాలపై భారీగా రాయితీలు..
- కూరగాయల సాగుకు రూ.125 కోట్లకుపైగా కేటాయింపులు
- పామాయిల్‌తో పాటు అంతర పంటలకు ప్రోత్సాహం..
- కొత్త వ్యవసాయ కళాశాలల ఏర్పాటు, సీట్ల పెంపు
- శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి తుమ్మల



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతికత, నాణ్యమైన ఇన్‌పుట్స్, సాగునీటి సదుపాయాలు, శిక్షణ, ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్, మార్కెటింగ్ వంటి అన్ని రంగాలను సమన్వయం చేసి సమగ్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ రోజు శాసనసభలో తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగుపై కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, యశస్వినీ రెడ్డి, తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.
గతంలో తెలంగాణలో సుమారు 3 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగితే, ప్రస్తుతం అది సుమారు లక్ష ఎకరాలకు తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. ఫలితంగా 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ వానాకాలంలో 51000 సాధారణ విస్తీర్ణానికి గాను 72,583 ఎకరాలలో కూరగాయల సాగు జరిగిందని తెలిపారు. కూరగాయల ధరలు ప్రధానంగా డిమాండ్, సరఫరాపై ఆధారపడి ఉండటం వల్ల మార్కెట్లో ధరల్లో తరచూ హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులకు లాభదాయకమైన పంటల వైపు వెళ్లేలా ప్రోత్సహించడంతో పాటు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నారు, మల్చింగ్, షేడ్‌నెట్, శాశ్వత పందిళ్లు, బిందు మరియు తుంపర సేద్యం వంటి సదుపాయాలను రైతులకు రాయితీలపై అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూరగాయల నారు, మల్చింగ్, షేడ్‌నెట్ కోసం రూ.20 కోట్లు, శాశ్వత పందిళ్ల కోసం రూ.8 కోట్లు, బిందు సేద్యం కోసం రూ.97 కోట్లుకేటాయించినట్లు వెల్లడించారు. అన్ని పంటలకు విస్తీర్ణం ఆధారంగానే రైతు భరోసా అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తక్షణమే పెంచేందుకు ప్రస్తుత వానాకాలంలో సుమారు లక్ష ఎకరాల్లో, తదుపరి రబీ సీజన్‌లో మరో లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణకు అవసరమైన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా చేసి, తెలంగాణలో పండించిన కూరగాయలు ఇతర రాష్ట్రాలకు వెళ్లే స్థాయికి ఉత్పత్తిని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. రైతులు అధిక దిగుబడి, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు వెళ్లేలా వ్యవసాయ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కొన్ని పంటలు, కొన్ని పద్ధతులకే రాయితీలు పరిమితం కావడం వల్ల వ్యవసాయంలో సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. రైతులకు అవసరమైన పంటలు, భూమి సంరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే విధంగా రాయితీల విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి సేద్యాన్ని కూడా పెంచి పోషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకొని రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. యూరియా వినియోగం పెరగడం వల్ల పురుగు మందుల వినియోగం కూడా పెరుగుతోందని మంత్రి తెలిపారు. యూరియా వినియోగాన్ని సమతుల్యం చేసేలా, భూమిని సంరక్షించే ఎరువులకు ప్రాధాన్యతనిచ్చే విధంగా సబ్సిడీ విధానాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు.



## ఈనెల 17న ఘనంగా ప్రజాపాలనా దినోత్సవం

- పబ్లిక్ గార్డెన్‌లో విస్తృత ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ఏర్పాట్లపై సచివాలయంలో సిఎస్ సమీక్ష

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** ఈనెల 17 వతేదీన నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంత రం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూ పంవద్ద, పబ్లిక్ గార్డెన్ లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు , చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కు గానూ ఈనెల 15న పూర్తి డ్రెస్ రిహార్సల్స్ ను పూర్తి చేయాలని ఆదేశిం చారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయి మంది స్వయం సహాయక మహి ళలతో పాటు రెండు వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

## నిజ జీవితంలో విజయ్ హీరో కాదు, విలన్

**టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు**

**చెన్నై, సెప్టెంబర్ 10 :** తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌పై ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల్లోనే విజయ్ హీరో అని, నిజ జీవితంలో మాత్రం ఆయనో ఒక పెద్ద విలన్ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ లో విజయ్ చేసిన ఒక సైగపై వివాదం చెలరేగిన నేపథ్యంలో దినకరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగ, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అపహాస్యం చేసేలా ఉందన్న విమర్శలతో రాజకీయ దుమారం రేగింది. 1976 ఎమర్జెన్సీ కాలంలో జైలులో పోలీసుల దాడి కారణంగా స్టాలిన్ దవడ ఎముక విరిగింది. విజయ్ చేసిన సైగ ఆ విషయాన్ని ఎగతాళి చేసేలా ఉందని డీఎంకే నేతలు మండిపడ్డారు. అయితే, ఆ సైగ యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప ఉద్దేశపూర్వకం కాదని విజయ్ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదం సద్దుమణగలేదు. స్వయంగా స్టాలిన్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ, జైలులో తాను అనుభవించిన చిత్రహింసలను గుర్తుచేసుకున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రను చదువుకోవాలని విజయ్‌కు హితవు పలికారు. ఈ వివాదంపై దినకరన్ మరింత ఘాటుగా స్పందించారు. "విజయ్ ఒక స్వార్థపరుడు, తన స్వలాభం కోసం ఎవరినైనా బలి ఇచ్చే మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఆయన మాట తీరు, బాడీ లాంగ్వేజ్ చూస్తుంటేనే ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో అర్థమవుతోంది" అని దినకరన్ తీవ్రంగా ఆరోపించారు.

## ఆర్టీసీ బస్సు బీభత్సం..

- పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు
- ఘటనలో రెండు కార్లు, ఆటో ధ్వంసం

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను తప్పించేందుకు ప్రయత్నించిన సమయంలో ఆర్టీసీ అద్దె బస్సు నియంత్రణ కోల్పోయినట్లు సమాచారం. ఆ తర్వాత రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు అక్కడ నిలిపి ఉన్న వాహనాలను ఢీకొట్టింది. బస్సు బంకులోకి వెళ్లే క్రమంలో రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టింది. అంతేకాకుండా డీజిల్ పంపునకు కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది.బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన మొత్తం ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డైంది. ప్రస్తుతం ఈ దృశ్యాలు బయటకు రావడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

# ఉద్యోగుల పక్షాన ఉంటా..

- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తాం
- పీఆర్‌సీ నివేదికను వెంటనే అందాలి
- డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ
- సమస్యలపై సీఎంతో జేఏసీ చర్చలు



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్‌ఈఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్‌ఈఎస్‌ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

"గత మూడు రోజులుగా జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించింది. బీఆర్‌ఎస్ నేతల తీరునే ప్రజలు తప్పుబట్టినట్లు సర్వేలో తేలింది. ప్రభుత్వంపై వ్యతిరేకత లేనట్లు తేలింది. ఎస్‌ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేల్చారు. కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు. దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి" – సీఎల్పీ సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సభను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్? సభను సజావుగా జరగకుండా కుట్ర చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు.

## గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## పదవి ఇచ్చేది అధిష్ఠానం.. రేవంత్‌రెడ్డి కాదు

**కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** సీఎం, తాను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరి చూస్తున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంతో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి, చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమని వివరించారు. అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియా చిట్?చాట్ నిర్వహించారు. మంత్రి పదవి కోసం రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారని, కానీ కలిస్తే కాంప్రమైజ్, కలవకపోతె గ్యాప్ పెరిగిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం కానీ రేవంత్‌రెడ్డి కాదని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42)ను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా నరికి హత్య చేసిన ఘటన కలకలం రేపింది. తాజాగా ఈ కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. గ్రామంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో లక్ష్మిపై దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతోనే ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దారుణంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, మంత్రాలపై ఉన్న అనుమానం, నిందితుల పాత్ర వంటి అంశాలపై ఆరా తీశారు. దర్యాప్తులో ఇద్దరిని నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కేసుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న ఒక గొడ్డలితో పాటు సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులను కేసు దర్యాప్తులో కీలక ఆధారాలుగా పరిగణిస్తున్నారు. హత్య వెనుక మరేదైనా కారణం ఉందా? మంత్రాలపై ఉన్న అనుమానమే అసలు కారణమా? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం నెల్కి వెంకటాపూర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. 42 ఏళ్ల లక్ష్మి దారుణ హత్యకు గురికావడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తాజాగా ఇద్దరు నిందితుల అరెస్టుతో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై స్పష్టత

- ఆశ్రమ పాఠశాలల పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై పరిశీలన
- శాసనమండలిలో సభ్యుల పలు ప్రశ్నలకు జవాబిచ్చిన మంత్రి అడ్లూరి



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** రాష్ట్రంలోని విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన అంశాలపై సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలంగాణ శాసన మండలిలో గురువారం శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న , తక్కెళ్ళపల్లి రవీందర్ రావ్ , సత్యం నెలికంటి లేవనెత్తిన అంశాలకు మంత్రి అడ్లూరి వివరాలను వెల్లడించారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల పరిస్థితి గురించి ప్రస్తావిస్తూ.. 2025--26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడానికి వారి నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయన్న అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ, అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దీంతో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలకు సంబంధించిన తదుపరి ప్రశ్న ఉత్పన్నం కాదని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీలు శ్రీపాల్ రెడ్డి లేవనెత్తిన అంశం....పండిట్లు, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్ , ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్లు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై మంత్రి అడ్లూరి.. సమాధానం ఇస్తూ... ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రతిపాదనపై సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది అంశాలపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి అడ్లూరి తెలిపారు.

## అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

**తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# ప్రైవేటీకరణకే మొగ్గు?



**ఇస్రో అంటే నేటి ప్రపంచంలో తెలియని వారుండరు. ఇస్రో అంతరిక్షయానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపాదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటికే ఎన్నో పరిశోధనలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికారై చెక్కర్లు కొడుతోంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది.**

ఇస్రోను ప్రభుత్వం ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయిజరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది.

ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమించుకోవాలి. ప్రైవేటు దిశగా ప్రయత్నాలు చేస్తే దేశ అడ్డుకొని ప్రైవేటు పరంగా కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ్ ప్రజలపై ఎంతైనా ఉంది.

# టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

## రాష్ట్ర పార్టీ హోదా కల్పిస్తూ ఈసీ నిర్ణయం



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 :** ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

# హత్య కేసులో లొంగిపోయిన నిందితుడు

**నెల్లూరు, సెప్టెంబర్ 10 :** నెల్లూరు, తిరుపతి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సంచలనం సృష్టించిన టీడీపీ కార్యకర్త బాలయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో, పోలీసులు ఆయనను భద్రత నడుమ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. పెళ్లకూరు మండలం చిల్లకూరు ప్రాంతంలోని కాల్వలు, ప్రభుత్వ పోరంబోకు భూములను సత్యనారాయణ రెడ్డి ఆక్రమించారంటూ స్థానిక టీడీపీ నేతలు గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సంయుక్త సర్వేలో ఆక్రమణ నిజమేనని తేలింది. ఆక్రమిత స్థలంలో తన సొంత పొలానికి దారి వేసుకునేందుకు సత్యనారాయణరెడ్డి ప్రయత్నించగా టీడీపీ కార్యకర్త బాలయ్య సహా పలువురు అడ్డుకుని ప్రశ్నించారు. దీంతో ఆక్రోశానికి గురైన సత్యనారాయణరెడ్డి, తన అనుచరులతో కలిసి టీడీపీ నేతలపై దాడికి తెగబడ్డారు. ఈ గొడవలో బాలయ్య ఛాతీపై ప్రత్యర్థులు పిడిగుద్దులతో విరుచుకుపడటంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సత్యనారాయణ రెడ్డిని ఏ1 నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేయగా... పోలీసు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆయన చివరకు కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది.

# చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం

## మరమ్మతుల కోసం ఆగిన కార్గో నౌక.. 25 మంది మృతి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 :** చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 25 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## నాయకత్వంలో కొత్త ఆలోచన..

# పాలనలో సరికొత్త వేగం

### న్యూ ఏజ్ గవర్నెన్స్‌తో స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన

### 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 10 :** నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో లీడర్షిప్ న్యూ ఏజ్ గవర్నెన్స్ అంశంపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాము లీడర్షిప్ ట్రాన్సిషన్‌లో ఉన్నామని, న్యూ లీడర్షిప్ అప్రోచ్‌తో పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నాయకత్వం అనేది సెల్ఫ్ మోటివేషన్‌తో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఫైల్స్, డేటా లేక్ వంటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూసుకుంటూ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. టెక్నాలజీ యుగంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారిందని, నైపుణ్యానికి ఎంత పదును పెడితే అంత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. మహిళలు? పురుషులు అనే వ్యత్యాసం గత కాలపు నినాదమని, ఇప్పుడు ఆ తేడా లేదని సీఎం చంద్రబాబు అన్నారు. బ్యూరోక్రసీకి, రాజకీయ నేతలకు వేర్వేరు నైపుణ్యాలు ఉండాల్సిందేనని పేర్కొన్నారు. ప్రతి నాయకుడూ తన బృందాన్ని ఎంత ప్రభావవంతంగా నిర్మిస్తారన్నదే ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి రంగంలోనూ సంతృప్తి అనేదే ముఖ్యమని అన్నారు. ప్రపంచంలోనే భారతీయ ఎంట్రప్రెన్యూర్స్ అత్యుత్తమంగా ఉన్నారని, ప్రతిష్ఠాత్మక కంపెనీలకు వారే సారథ్యం వహిస్తున్నారని సీఎం చెప్పారు. ఏ వ్యవస్థలో అయినా ఇమిడిపోయే తత్వం భారతీయులదని, దానికి అనుగుణంగా మనం కూడా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగ వ్యవస్థలే మారిపోతున్నాయని, అంతిమంగా క్రెడిబిలిటీ అనేదే కీలకమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమను తాము మార్చుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గతంలో చాలా అంశాలపై దృష్టి పెట్టామని, ఇప్పుడు నాయకత్వంపైనే ఆలోచన చేయాలని నిర్ణయించామని తెలిపారు. నూతన నాయకత్వ విధానంతో పనిచేయడం ద్వారా వేగంగా ఫలితాలను సాధించడంతో పాటు స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకునేందుకు ఆస్కారం ఉంటుందని సీఎం అన్నారు.

# 28 లక్షల ఎకరాలు 22-ఏ జాబితా నుండి తొలగింపు

### కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి,సెప్టెంబరు 10 :** రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22-ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22-ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జీవో నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు

# చిన్నారుల కోసం 21 కొత్త పోషకాహార కేంద్రాలు

### రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి,సెప్టెంబరు 10 :** రాష్ట్రంలో తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. కొత్తగా 21 పోషకాహార పునరావాస కేంద్రాలు (ఎన్ఆర్సీలు) ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 175 పడకలు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఎనిమిది 10 పడకల ఎన్ఆర్సీలు, ఏడు 5 పడకల ఇంటిగ్రేటెడ్ ఎన్ఆర్సీలు, మరో ఆరు 10 పడకల కొత్త కేంద్రాలు దశలవారీగా వినియోగంలోకి రానున్నాయి. ఇవన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఎన్ఆర్సీల సంఖ్య 21 నుంచి 42కు, పడకల సంఖ్య 340 నుంచి 515కు పెరుగుతాయని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేడొక ప్రకటనలో వెల్లడించారు.



# డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది

### మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 :** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తుచేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# డిజిటల్ కనెక్టివిటీపై సమీక్ష

**అమరావతి, సెప్టెంబర్ 10 :** కలెక్టర్ల సమావేశంలో డిజిటల్ కనెక్టివిటీ పై సమీక్ష జరిపిన చంద్రబాబు రాష్ట్రంలో మారుమూల గ్రామాలకూ వంద శాతం మొబైల్ కనెక్టివిటీ ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ నెట్‌వర్క్ విస్తరణపై ఐటీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సమగ్రమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ 4జీ,5జీ సేవలను నిరంతరాయంగా అందించేందుకు చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద బీఎస్ఎన్ఎల్, జియో సంస్థల ద్వారా రాష్ట్రానికి మొత్తం 1,023 టెలికాం టవర్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో ఇప్పటికే 143 చోట్ల పనులు పూర్తయి సిగ్నల్స్ వస్తున్నాయని, 428 చోట్ల పనులు జరుగుతున్నాయని, భూమి అప్పగించిన 423 ప్రాంతాల్లో పనులు మొదలుకావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇంకా వివిధ జిల్లాల్లో 18 చోట్ల రెవెన్యూ భూమి, మరో 11 చోట్ల అటవీ భూముల క్లియరెన్స్ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ వివరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ టవర్ల ఏర్పాటులో జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలతో సహా రాష్ట్రం నలుమూలలా కనెక్టివిటీ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైతే ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తామని ముందే చెప్పినప్పుడు అధికారులు భూమి కేటాయింపుల్లో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యతను వేరొకరిపై నెట్టేసే పద్ధతి మానుకుని స్వయంగా బాధ్యత తీసుకుని పని చేయాలని స్పష్టం చేశారు.

# హజ్ యాత్రికులకు వైద్య పరీక్షల కోసం ఏర్పాట్లు

### మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

**అమరావతి, సెప్టెంబరు 10 :** పవిత్ర హజ్ యాత్ర- 2027 (1448-హెచ్)కు దరఖాస్తు చేసుకొని ఎంపికైన హాజీలకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీచేసిన సర్క్యులర్ ప్రకారం తప్పనిసరిగా నిర్దేశిత వైద్య పరీక్షలు చేయించుకుని శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉందని అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు (డిఎంహెచ్వోలు) ఆదేశాలను రాష్ట్ర హజ్ కమిటీ జారీ చేయడం కూడా జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఎంపికైన హజ్ యాత్రికులకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు/ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. అధీకృత ప్రభుత్వ అల్లోపతిక్ వైద్య అధికారులు నిర్దేశిత వైద్య పరీక్షలు నిర్వహించి, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్దేశించిన నమూనాలో వైద్య పరీక్షలు, శారీరక దృఢత్వ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారని మంత్రి ఫరూక్ వెల్లడించారు.

# గిరిజన బిడ్డగా సేవే లక్ష్యంగా..

## మనసుతో కాకీ ధరించి ప్రజలకు అండగా సీఐ నూనావత్ సాగర్



**కారేపల్లి నేడు న్యూస్:** మట్టి మనుషుల నుంచి ఎదిగిన ఓ గిరిజన బిడ్డ.. తన మూలాలను మరువకుండా ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ ముందుకు సాగుతున్నారు సీఐ నూనావత్ సాగర్. ఖాకీ దుస్తులు కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా, మనసుతో కాకీ ధరించి, మానవత్వాన్ని తన బాధ్యతగా మలుచుకుని ప్రజలకు అండగా నిలుస్తున్నారు. భూమి కోసం.. భుక్తి కోసం.. పీడిత ప్రజల విముక్తి కోసం తెలంగాణ గడ్డపై ఎందరో వీరులు పోరాడిన చరిత్రను స్ఫూర్తిగా తీసుకుంటూ, నేటి సమాజంలో ప్రజలకు అవసరమైన సమయంలో తన వంతు సహాయం అందించడమే నిజమైన సేవగా సీఐ నూనావత్ సాగర్ భావిస్తున్నారు. గిరిజన కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను అధిగమించి పోలీసు అధికారిగా ఎదిగిన ఆయన.. సామాన్య ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తున్నారు. నిరుపేదలు, గిరిజనులు, అణగారిన వర్గాలకు అవసరమైన సమయంలో మానవీయ దృక్పథంతో స్పందిస్తూ తన వంతు సహాయం అందిస్తున్నారు. కాకీ దుస్తులు శరీరంపై ఉన్నా.. సేవా భావం మాత్రం మనసులో ఉండాలనే సిద్ధాంతంతో సీఐ సాగర్ ముందుకు సాగుతున్నారు. పోలీసు అధికారిగా విధి నిర్వహణతో పాటు, ఆపదలో ఉన్న వారికి భరోసా కల్పించడం, అవసరమైన వారికి అండగా నిలవడం ఆయన సేవా తత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# రైతుల రాకపోకలకు అడ్డంకి.. రైల్వే అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి

## యువజన కాంగ్రెస్ నేత గుగులోత్ హర్ష నాయక్



**కారేపల్లి, నేడు న్యూస్:** భాగ్యనగర్ తండా మరియు పరిసర ఐదు తండాల ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ కోరారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని తన స్వగ్రామంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించా రు. ఈ సందర్భంగా గిరిజన రైతులు ఎదుర్కొంటున్న పోడు భూముల పట్టాలు, హక్కుల సమస్యలను కమిషన్ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పరిధిలోని భాగ్యనగర్ తండా, పరిసర తండాల రైతులు, రైతు కూలీలు ప్రతిరోజూ వ్యవసాయ పనుల నిమిత్తం రైల్వే ట్రాక్ దాటి తమ పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. రైల్వే అధికారులు ట్రాక్ దాటేందుకు అనుమతి నిరాకరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనుమతి లేకుండా ట్రాక్ దాటితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారని హర్ష నాయక్ తెలిపారు. గతంలో పలుమార్లు అధికారులకు వినతులు సమర్పించి నప్పటికీ సమస్యకు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని జరుపుల బాలాజీ చేను సమీపంలోని రైల్వే స్తంభం నంబర్ ఖా/5/5 వద్ద అండర్‌పాస్ లేదా రైల్వే గేట్ ఏర్పాటు చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కోరారు. ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత రైల్వే అధికారులతో చర్చించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హుస్సేన్ నాయక్ హామీ ఇచ్చినట్లు హర్ష నాయక్ తెలిపారు. రైతులు, రైతు కూలీల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, రైల్వే అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

## దిశా కమిటీ సభ్యురాలు, సర్పంచ్ హేమలత బాలాజీ



**కారేపల్లి, నేడు న్యూస్:** పోలీసులపై దాడులకు పాల్పడటం, ఇతరులపై దాడులు చేయడం, శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ చట్టాన్ని, పోలీసు వ్యవస్థను, రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, దాడులకు పాల్పడటం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు బిల్లుల సాధనకు కృషి చేస్తూ, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు ముందుకు సాగేలా అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తున్నానని హేమలత బాలాజీ తెలిపారు. అదే విధంగా ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యురాలిగా జిల్లా ప్రజలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అంశాలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులపై దాడులు, ప్రజా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు వంటి చర్యలు సమాజంలో అశాంతికి దారితీస్తాయని ఆమె అన్నారు. ముఖ్యంగా శాసనసభ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తులు సంయమనం పాటించాలని, రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే వ్యక్తం చేయాలని దిశా కమిటీ సభ్యురాలు, సర్పంచ్ హేమలత బాలాజీ కోరారు.



# అల్వాల్‌లో ఘనంగా అమావాస్య అన్నప్రసాద వితరణ

**సికింద్రాబాద్,నేడు న్యూస్:** అల్వాల్ ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో 19వ మాసం అమావాస్య సందర్భంగా నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, దాతలు, ఆర్యవైశ్య సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దక్షిణ భారత ఐవీఎఫ్ ఇన్‌చార్జ్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రమేష్, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ తడక వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అల్వాల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోలి గోపాల్, కార్యక్రమ నిర్వాహకులు ఐత సత్యం, తొడుపునూరి బాలేష్, అమర బాలేష్, పాలకుర్తి నరేష్, గంగ మల్లేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి మాసం సుమారు 500 మందికి అన్నప్రసాద వితరణ చేస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులను పలువురు అభినందించారు.

# ఎక్స్‌పైరీ ఇంజెక్షన్‌తో ప్రభుత్వ ఆసుపత్రిలో రచ్చ?

## రోగికి ఇవ్వొద్దన్న సిబ్బందిపై దాడి ఆరోపణలు.!

### ఉన్నతాధికారుల విచారణకు డిమాండ్



**దుబ్బాక, నేడు న్యూస్:** సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది మధ్య ఎక్స్‌పైరీ ఇంజెక్షన్ విషయంలో తలెత్తిన వివాదం దాడికి దారి తీసింది. ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్ ఝాన్సీ, ఏఎన్ఎం దీపిక మధ్య ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ రోగికి ఎక్స్‌పైరీ అయిన ఇంజెక్షన్‌ను రోగికి ఇవ్వాలని ఝాన్సీ సూచించగా, రోగికి ఇబ్బంది అవుతుందని నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఝాన్సీ, దీపిక కాలర్ పట్టుకుని తోసేయగా స్వల్ప గాయాలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని ఆసుపత్రి సిబ్బంది మెడికల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ శ్రీకాంత్



దృష్టికి వెళ్ళింది. ఈ ఘటనతో పాటు ఎక్స్పైరీ మందులు ఆసుపత్రిలో ఉండటంపై కూడా డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లినట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్స్‌పైరీ మందులు, ఇంజెక్షన్లు ఉండటంపై రోగులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆసుపత్రిలో మందుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి రోగుల భద్రతకు భరోసా కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నకిలీ ఎక్స్ ఖాతా ఆధారంగా అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- సీఎం రేవంత్‌రెడ్డిపై రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు



**ఉప్పల్, నేడు న్యూస్:** నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని తెలంగాణ శాసనసభలో నిరాధార ఆరోపణలు చేశారని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిపై రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గురువారం అసెంబ్లీ సెక్రటరీ రెడ్ల తిరుపతికి ఈ నోటీసును అందజేశారు. సెప్టెంబర్ 9న అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్నట్లు పేర్కొన్న ఎక్స్ ఖాతాలోని పోస్టును ప్రస్తావించారని ఎమ్మెల్యేలు తెలిపారు. బీఆర్ఎస్‌లో లేని 'అంతర్జాతీయ కార్యదర్శి' పదవిని సృష్టించి, ఆ పేరుతో ఉన్న నకిలీ సోషల్ మీడియా ఖాతాలోని సమాచారాన్ని శాసనసభలో ప్రస్తావించడం సభను తప్పుదోవ పట్టించే చర్యగా వారు ఆరోపించారు. అవాస్తవ, నిరాధార సమాచారాన్ని సభలో ప్రదర్శించడం ద్వారా సభా గౌరవానికి భంగం కలిగిందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని తక్షణమే పరిశీ లించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని బండారి లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు.

# ప్రజాకవి కాళోజీ జీవితం-సాహిత్యంపై విద్యార్థి సదస్సులు

## ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య విలువలకు కాళోజీ ప్రతీక: అధ్యాపకులు



**ఉప్పల్, నేడు న్యూస్:** పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉప్పల్‌లో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రథమ సెమిస్టర్ విద్యార్థులు కాళోజీ జీవితం, సాహిత్యంపై విద్యార్థి సదస్సులు నిర్వహించారు. కాళోజీ ఆత్మగౌరవానికి, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీకగా నిలిచారని కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త డా. ఏసీహెచ్ సత్యనారాయణ అన్నారు. తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో కాళోజీ కీలక పాత్ర పోషించారని, ఆయన రచనలు ప్రజల్లో చైతన్యం నింపాయని పేర్కొన్నారు. విద్యార్థులు కాళోజీ సాహిత్యాన్ని చదివి ఆయన ఆశయాలను తెలుసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం కాళోజీ జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పి. విజయ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్ఎంపీ, పిఎంపిలకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలి



**శేరిలింగంపల్లి నేడు న్యూస్ :** గ్రామీణ, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని టీఆర్పీఎస్ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం ప్రతినిధులు కోరారు. పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటరెడ్డి, జీహెచ్ఎంసీ అధ్యక్షుడు ఎండీ జఫ్ఫార్, మహిళా అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి జయశ్రీతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. జీవో 1273, జీవో 428, జీవో 429 ప్రకారం ప్రభుత్వానికి రుసుము చెల్లించి శిక్షణ పొందిన ఆర్ఎంపీ, పీఎంపీలకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ఇంకా శిక్షణ పొందని వారికి కూడా శిక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫేక్ డాక్టర్లపై చర్యల నేపథ్యంలో ఆర్ఎంపీ, పీఎంపీలలో ఆందోళన నెలకొందని, వారిని భయ భ్రాంతులకు గురిచేయకుండా స్పష్టమైన నిబంధనలు రూపొందించి నిర్దేశించిన పరిధిలో వైద్య సేవలు అందించే అవకాశం కల్పించాలని అన్నారు. పల్స్ పోలియో, ఎయిడ్స్ అవగాహన, కుటుంబ నియంత్రణ తదితర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**జవహర్ నగర్, నేడు న్యూస్ :** అంబేద్కర్ నగర్లోని ధోబి ఘాట్ వద్ద చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చాగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సదానంద్, మాజీ కార్పొరేటర్లు ఎడ్ల శ్రీనివాసరెడ్డి, కుతాడి సాయికుమార్, నాయకులు మారగొని వెంకటేష్ లు పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తితో రజకులు వారి హక్కుల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చాగంటి వెంకటేష్ మాట్లాడుతూ రజకులకు విద్యా, ఉద్యోగ, పారిశ్రామిక రంగాలలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ట్యాంక్ బండ్ పై చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి, పార్లమెంటులో ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఆర్ ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, మైలారం జనార్ధన్, పలాస సాయికుమార్, పలాస అశోక్, పలాస కిరణ్, చీమల కొండూరు యాదగిరి, చిట్యాల సత్తయ్య, సిద్దయ్య, కే. గిరి, ఉపేందర్, ఎల్లమ్మ, బుచ్చమ్మ, నరసమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, నేడు న్యూస్:** తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈసీఐఎల్ చౌరస్తాలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవం, మహిళా చైతన్యం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. నాటి రజాకారులు, భూస్వాముల దోపిడీకి ఎదురొడ్డి ఆమె చూపిన ధైర్యం, తెగువ తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ : మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్

**జవహర్ నగర్, నేడు న్యూస్ :** తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్ల నిరంకుశత్వానికి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ నగర్ దోబీ ఘాట్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు ఐలమ్మ చూపిన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ గుప్తా, సీనియర్ నాయకులు కోటేష్ గౌడ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫిక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్ల వినయ్, నాయకులు గజ్వేల్ శంకర్, పలాస సాయికుమార్, వెంకటేష్, మంద ఆనంద్, కన్నబోయిన రాజు యాదవ్, ఎరుకల వెంకటయ్య, స్వామి, కరుణాకర్, మొక్క నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



# సీతాఫల్మండి సమస్యలు పరిష్కరించాలి

## స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్‌కు డా. సామల హేమ వినతి

**సికింద్రాబాద్,నేడు న్యూస్:** సీతాఫల్మండి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, రోడ్ల మరమ్మతులు, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ జిహెచ్ఎంసి స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై గుంతలను తక్షణమే పూడ్చాలని, డివిజన్‌కు ప్రత్యేక ఎమర్జెన్సీ రోడ్డు రిపేర్ వాహనం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎస్ హెచ్ జి మహిళల సమస్యలను పరిష్కరించాలని, సీతాఫల్మండి జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు తాత్కాలిక తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.




# కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పీహెచ్‌డీ సాధించిన దీపా బానోత్

**కాప్రా, నేడు న్యూస్:** కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉస్మానియా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధన పూర్తి చేసి దీపా బానోత్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను చూసుకుంటూనే ఉన్నత విద్యను కొనసాగించి డాక్టరేట్ పొందడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. "తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం" అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. సమున్నత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి, ఉన్నత విద్యా సంస్థల్లో ఉద్యోగుల సంతృప్తికి సంబంధించి పలు సూచనలు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, విభాగాధిపతి ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు, అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది దీపా బానోత్‌ను అభినందించారు. తన విజయానికి భర్త రవి తేజ, కుటుంబ సభ్యులు, పరిశోధన పర్యవేక్షకురాలు సమున్నత అందించిన ప్రోత్సాహం, సహకారం ఎంతో కీలకమని దీపా బానోత్ తెలిపారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే మహిళలకు తన విజయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం: పరమేశ్వర్‌రెడ్డి

**రామంతాపూర్, నేడు న్యూస్:** చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని రామంతాపూర్ చిన్న చెరువు దోబీఘాట్‌లోని ఐలమ్మ విగ్రహానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం సాయుధ పోరాటంలో ఐలమ్మ చూపిన ధైర్యం, తెగువ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకలని అన్నారు. ఆమె జీవితం తెలంగాణ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని, ఐలమ్మ ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రామంతాపూర్ రజక సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### చాకలి ఐలమ్మ కేవలం పేరు కాదు..
## ఒక చరిత్ర: బన్నాల గీత

**ఉప్పల్, నేడు న్యూస్:** చిల్కానగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ మేడేలయ్య రజక సంఘం ఉప్పల్ అధ్యక్షుడు కోలూరి శ్యామ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ బన్నాల గీత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరై ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బన్నాల గీత మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ వీరోచితంగా పోరాడారని అన్నారు. దొరల పెత్తనం, భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన ఆమె పోరాటం తెలంగాణ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. "చాకలి ఐలమ్మ కేవలం ఒక పేరు కాదు.. ఆమె ఒక చరిత్ర" అని పేర్కొన్నారు. ఐలమ్మ త్యాగం, పోరాట స్ఫూర్తి తరతరాలకు ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం: కిరణ్‌కుమార్‌రావు

**కాప్రా, నేడు న్యూస్:** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ధైర్యసాహసాలతో చరిత్రలో నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని దొమ్మాటి కిరణ్‌కుమార్‌రావు అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమెకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి, పేదల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. భూస్వామ్య, వెట్టిచాకిరీ వ్యవస్థలకు ఎదురొడ్డి హక్కుల కోసం పోరాడిన ఆమె మహిళా ధైర్యానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పేదలు, బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారుడు కీర్తి శ్రీనివాస్, రిపోర్టర్ నర్రా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలి
### సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి

**దుబ్బాక, నేడు న్యూస్:** వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, శాంతి, సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో వినాయక మండపాల ఉత్సవ కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్లైన్లో తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. మండపాల వద్ద పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. డీజేలను వినియోగించవద్దని మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి మండపం వద్ద ఒక వాలంటీర్ను ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యమిస్తుందని, ఉత్సవాలను ఎవరికి ఇబ్బంది కలగకుండా నిర్వహించేందుకు అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక పురపాలిక కమిషనర్ మహేష్ కుమార్, సిఐ రాజేష్, ఎస్సై కీర్తిరాజు, ఫైర్ ఆఫీసర్ రాజ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ కనకరాజు, నాయకులు, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

### పాలు ఆలస్యమైనా..
# మద్యం మాత్రం ఇంటి వద్దకే!

- సింగరేణిలో మద్యం దందాపై ఫిర్యాదులు.. రూ.60 వరకు అదనపు వసూళ్ల ఆరోపణలు
- తెల్లవారుజామునే ఆటోల ద్వారా సరఫరా.. అధికారుల నిఘాపై ప్రజల ప్రశ్నలు




**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండల పరిధిలో మద్యం విక్రయాలు, అధిక ధరల వసూళ్లపై ప్రజల నుంచి తీవ్ర ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువె త్తుతున్నాయి. మండలంలోని నాలుగు మద్యం దుకాణాల నుంచి తెల్లవారుజామున 5.30 గంటల నుంచే ఆటోల ద్వారా గ్రామాలకు మద్యం తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. 41 గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలకు మద్యం సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

### పేద ప్రజలపై రూ.60 అదనపు భారం?

మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్‌పై ప్రభుత్వ ధరకు అదనంగా రూ.20 వరకు వసూలు చేస్తున్నారని, అదే మద్యం బెల్టు షాపుల్లో మరో రూ.40 వరకు అధికంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంటే పేద ప్రజల నుంచి ఒక్క క్వార్టర్‌పై మొత్తం రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలు, నిత్యావసర వస్తువులు ఆలస్యంగా వచ్చినా.. మద్యం మాత్రం తెల్లవారుజామునే ఆటోల ద్వారా గ్రామాల్లోని ఇళ్ల వద్దకు చేరుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు సంబంధిత ఆబ్కారి అధికారులకు, కారేపల్లి ఆబ్కారి శాఖ సీఐకి ఫిర్యాదు చేసినా చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చూసీచూడనట్లు అధికారులు?

మండల కేంద్రానికి, పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే మద్యం అక్రమ సరఫరా, అధిక ధరల వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

### యువత భవిష్యత్తుపై ఆందోళన

గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో యువత, పేద కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామునే గ్రామాలకు మద్యం చేరుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సింగరేణి మండలంలోని నాలుగు మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ప్రభుత్వ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారా? ఆటోల ద్వారా గ్రామాలకు మద్యం సరఫరా చేస్తున్నారా? బెల్టు షాపుల్లో రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదులు పదేపదే వస్తున్నా అధికా రులు ఎందుకు స్పందించడం లేదు? పేద ప్రజల నుంచి రూ.60 వరకు అదనపు వసూళ్ల ఆరోపణలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? గ్రామాలకు తెల్లవారుజామున మద్యం సరఫరా అవుతున్న ఆరోపణలకు ఎప్పుడు అడ్డుకట్ట వేస్తారు? అనేది ఇప్పుడు సింగరేణి మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

### రైతు కూలీల సమరశంఖం..
# ఖమ్మంలో ఏఐకేఎంఎస్ మహాసభలు

- 28న భారీ బహిరంగ సభ.. 29, 30న అఖిలభారత నాలుగో మహాసభలు
- వేలాదిగా తరలిరావాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్ పిలుపు



**కారేపల్లి, నేడు న్యూస్:** అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి వై. ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ, 29, 30 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను కారేపల్లి మండలం మాదారం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై. ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయలేదని విమర్శించారు. రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లు, విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు నిర్వహించిన పోరాటాలను ఆయన గుర్తుచేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, ఎంఎస్‌పీకి చట్టబద్ధత, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు, కార్మికులకు కనీస వేతన చట్టం వంటి డిమాండ్లపై పోరాటాలను మరింత ఉధృతం చేసేందుకు మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు, 29, 30 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలకు రైతులు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, గడ్డం వెంకన్న, నరేష్, నరసింహారావు, రమేష్ పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ దళిత వ్యతిరేకి



- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటి విమర్శ
- బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరును ముక్తకంఠంతో ఖండించిన కాంగ్రెస్ నాయకులు
- ఎమ్మెల్యేలను ఉసిగొల్పింది కేసీఆరే
- ఆయన తక్షణమే క్షేమాపణ చెప్పాలి
- జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్

**మేడ్చల్, నేడు బ్యూరో:** శాసన సభ సమావేశాల సందర్భంగా ప్రతిపక్ష బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రజలు హేవగించుకునేలా ఉందని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటి ముక్త కంఠంతో ఖండించింది. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సత్యనారాయణ, జెనరల్ సెక్రటరీ బాల రెడ్డి, కృష్ణా రెడ్డి తదితరులు గురువారం శామీర్ పేటలో విలేఖరులతో మాట్లాడుతూ, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కావాలనే తమ ఎమ్మెల్యేలను రెచ్చగొట్టి సమావేశాలకు పంపించారని ఆరోపించారు. దాని ఫలితంగానే ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, తాతా మధు, నవీన్ రెడ్డి లు శాసన సభ వద్ద గలాటా సృష్టించారని, దీనికి బాధ్యులైన బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని వారు ప్రభుత్వానికి సూచించారు. బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేల వ్యవహార తీరును వారు దుయ్యబట్టారు. మీడియాతో వారు ఎవరేమి మాట్లాడింది వాటి వివరాలు ఇలా.

### ఎమ్మెల్యేలను ఉసిగొల్పింది కేసీఆరే : వేముల మహేష్ గౌడ్

ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ మాట్లాడుతూ, శాసన సభ సమావేశాల సందర్భంగా ప్రతి పక్ష బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలు చేసిన హంగామా రాష్ట్రమంతా చూశారని, ఇదంతా కేసీఆర్ కావాలని ఆడించిన ఆటగా వర్ణించారు. బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ , అసెంబ్లీ వద్ద అడ్డుకున్న పోలీస్ లను తోసివేయండని చేసిన సైగలను ప్రజలందరూ గమనించారని ఆయనే చెబుతూ, గతంలో బిఆర్ఎస్ నాయకులు దళిత నాయకులైన తాటి కొండ రాజయ్య, కొప్పుల ఈశ్వర్లను అవమాన పరచిన విధంగానే ఇప్పుడు శాసన సభ స్పీకర్ ను కించపరిచే విధంగా మాట్లాడారని, ఇందుకు కేసీఆర్ వారు ఎమ్మెల్యేలు మధు, నవీన్ లను ఉసిగొల్పారని, వీరి శాసన సభ సభ్యత్వాన్ని ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. దళితులు ఉన్నత పదవుల్లో ఉండకూడదనేదే కేసీఆర్ ఆలోచన విధానమని మహేష్ గౌడ్ పేర్కొంటూ, ఆధునిక యుగంలో కూడా దళితులను అవమానించడం దుర్మార్గమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, బిఆర్ఎస్, కేసీఆర్ ఇలాగే వ్యవహరిస్తే ఫలితాన్ని అనుభవించక తప్పదని, కేసీఆర్ స్పీకర్ కు క్షేమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

### దళితులను కించపరచడం బిఆర్ఎస్ సంస్కృతికి నిదర్శనం...జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఉద్దండపురం సత్యనారాయణ

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఉద్దండపురం సత్యనారాయణ మాట్లాడుతూ, దళితులను కించపరచడం బి.ఆర్.ఎస్ నాయకుల సంస్కృతిని నిదర్శనమన్నారు. రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం, దానిని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ వరకు దండోరా నిర్వహించిన దళితులను అవమానించేలా పసుపు నీటితో దారిని శుద్ధి చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. చస్తే నిన్ను బొంద పెట్టేది కూడా దళితులే అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన కేసీఆర్ కు సూచించారు. కేసీఆర్ తక్షణమే దళితులకు క్షేమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బి.ఆర్.ఎస్ దళిత వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి దళితులంతా బయటికిరావాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరులతో మాట్లాడిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి, జెనరల్ సెక్రటరీలు కృష్ణా రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, హరి బాబు తదితరులున్నారు.




## పేదలకు గునిశాలు ఫౌండేషన్ ఆహార పంపిణీ

**కాప్రా, నేడు న్యూస్:** గునిశాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది పేదలకు గురువారం కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో భోజనం పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ బి. సంతోషి తన తండ్రి గునిశాలు 26వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలు, వృద్ధులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది సుంకరి నరేష్, కాంగ్రెస్ నాయకులు పత్తికుమార్, పాతకోటి రామలింగం, సింగం కిరణ్, రామిరెడ్డి, లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ ప్రతినిధి రాణి తదితరులు పాల్గొన్నారు.



## పారా లీగల్ వాలంటీర్లకు అవగాహన

**మేడ్చల్ నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడలో ప్రధాన న్యాయ మూర్తి వి. బాల భాస్కర్ రావ్ ఆదేశాల మేరకు కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్ ప్రియాంక పారా లీగల్ వాలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయ సేవాధికర సంస్థ చట్టం ముఖ్య ఉద్దేశం, లక్ష్యాల గురించి పారా లీగల్ వాలంటీర్లకు వివరించారు. ఈ సమావేశం లో పారా లీగల్ వాలంటీర్ల హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ఈ సేవాధికర సంస్థ నెలవారి కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో 15 మంది పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



## హస్మత్ పేట మండల పరిషత్ స్కూల్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా: కె. ఆనంద్ హస్మత్‌పేట్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, పారిశుద్ధ్య పరిస్థితులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఆహార నిల్వల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం వంటశాలను సందర్శించి వంట సమయంలో ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంటగది నిర్వహణను స్వయంగా పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన డా: కె. ఆనంద్, మరుగుదొడ్లు సరైన స్థితిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా, పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అపరిశుభ్రత కారణంగా విద్యార్థుల్లో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. అలాగే, సామ్ – మామ్ పిల్లలను గుర్తించడం, వారి వివరాల నమోదు, ఆరోగ్య పరిస్థితిపై తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణ, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పాఠశాల పరిసరాల పారిశుద్ధ్యంపై విద్యార్థులకు తరగతి గదిలోనే అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు. డా: కె. ఆనంద్ సంబంధిత పాఠశాల సిబ్బందికి సూచించారు.



## గౌలిదొడ్డిలో ఘోర రోడ్డు ప్రమాదం
### ముగ్గురు యువకులు తీవ్ర గాయాలు

**శేరిలింగంపల్లి, నేడు న్యూస్ :** గచ్చిబౌలి సమీపంలోని గౌలిదొడ్డి జయభేరి ఫోర్ సీజన్స్ సిగ్నల్ వద్ద గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గోపన్‌పల్లి నుంచి గౌలిదొడ్డి వైపు వెళ్తున్న మారుతి ఆల్టో కారును (టీఎస్ 07 ఎఫ్‌క్యూ 4482)రాంగ్ రూట్లో అధిక వేగంతో వచ్చిన టిప్పర్ లారీ (ఏపీ 01 డబ్ల్యూ 6022) ఢీకొట్టడంతో కారులో ఉన్న దర్గుపల్లి జ్ఞానేశ్వర్, బి. శ్రీనివాస్ యాదవ్, కొర్ర సంతోష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురినీ 108 సేవల ద్వారా మెడికవర్ ఆసుపత్రికి తరలించగా, ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్థానిక న్యాయవాది డి. ప్రశాంత్ కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో లారీ డ్రైవర్ ర్యాష్‌గా, నిర్లక్ష్యంగా, రాంగ్ రూట్లో వాహనం నడిపి ప్రమాదం తలపెట్టినట్లు ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సిగ్నల్ కెమెరాలు, సిసిటీవీ ఫుటేజ్ పరిశీలిస్తూ లారీ డ్రైవర్, యజమాని వివరాలు సేకరిస్తున్నారు. గౌలిదొడ్డి, గోపన్‌పల్లి మార్గంలో భారీ వాహనాలు అధిక వేగంతో నడవడం సర్వసాధారణమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, జయభేరి సిగ్నల్ వద్ద కఠిన నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలోనే..
# ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాకు బీజం

- బీజేవైఎం రాష్ట్ర నాయకులు బండారు పవన్ రెడ్డి
- పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో చెరువు భూముల పరిరక్షణకు బీజేపీ పోరాటం
- మేడిపల్లిలో పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- కబ్జాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలన



**మేడిపల్లి, నేడు న్యూస్:** ప్రభుత్వ భూములు, చెరువు బఫర్‌జోన్ పరిరక్షణపై బీజేపీ నాయకులు చేపట్టిన పోరాటానికి స్పందన లభించింది. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 28లో ఉన్న సుమారు 15 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ స్థలంలో చెరువును ఆనుకుని ఉన్న బఫర్‌జోన్ భూములపై అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు జరుగుతున్నాయంటూ బీజేపీ నాయకులు పలుమార్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారులు గురువారం మేడిపల్లి ప్రాంతంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు బండారు పవన్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి లు ప్రభుత్వ భూముల పరిస్థితిని హైడ్రా అధికారులకు వివరించారు. బీజేపీ నాయకుల ఆరోపణల ప్రకారం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సర్వే నంబర్ 28 పరిధిలోని ప్రభుత్వ భూముల్లో సుమారు ఏడు ఎకరాల మేర భూమి మాయమైనట్లు, చెరువులో మట్టి పోసి కొందరు వ్యక్తులు కమర్షియల్ పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ భూముల పరిరక్షణపై నిర్లక్ష్యం కొనసాగిందని వారు ఆరోపించారు. అదేవిధంగా సర్వే నంబర్ 29లో కొంత మంది కన్స్ట్రక్షన్ పేరుతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములు, చెరువు బఫర్‌జోన్‌లను కాపాడాల్సిన అధికారులు గతంలో పట్టించుకోకపోవడం వల్లే ఆక్రమణదారులకు ధైర్యం వచ్చిందని బీజేపీ నాయకులు అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వాలే ఆక్రమణలకు పరోక్షంగా అవకాశం కల్పిస్తే ప్రజా ఆస్తులు ఎక్కడ మిగులుతాయి? అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనలో ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణ విషయంలో జరిగిన నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చెరువు బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల్లో జరిగిన ఆక్రమణలు, మట్టి పూడ్చివేతలు, నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులను కోరారు. ప్రభుత్వ భూమిని ఒక్క గజం కూడా ఆక్రమించకుండా కాపాడే వరకు బీజేపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మేడిపల్లిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటనతో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారనే ఆశాభావం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

---




## రైతు వ్యతిరేక చట్టాలపై రైతు ఉద్యమం

- కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలతో రైతు మనుగడ ప్రశ్నార్థకం
- ఎల్ ని నో ప్రభావంతో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి.
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం డిమాండ్

**ఉంగుటూరు, సెప్టెంబర్ 10 :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం లోని గుత్తికొండ వారి సత్రం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలపై రైతాంగం చారిత్రాత్మక ఉద్యమం చేశారని, ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేసి మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని, ఈ ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్నాయని, దీనితో రైతు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ల నియంత్రణ చట్టం, సహకార చట్టం, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం, ప్రకృతి వైపరీత్యాల సహాయ కార్యక్రమాల చట్టం, ఎరువుల విధానం, పంటల బీమా పథకం, డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ ఇలా అనేక చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చి వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎకరాలు రాష్ట్రంలో భూ సేకరణ చేసి కార్పొరేట్ కంపెనీలకు రైతుల భూములను కట్టబెట్టాలని చూస్తోందని, బలవంతపు భూసేకరణ వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకోవాల న్నారు. పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, పాడిపశువులకు సబ్సిడీపై దాణా అందించాలని కోరారు. కోకో,కొబ్బరి, ఆయిల్ పామ్, పొగాకు, విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతాంగ సమస్యలపై దశల వారి ఉద్యమం చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, లావేటి సోంబాబు, బోడిక రామచంద్ర రావు, దాసరి సతీష్, వీరవల్లి భాస్కరరావు, సున్నా వెంకట్రావు, గుండపనేని సురేష్, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

---

## ఇంధన ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి

**ఇంధన శాఖ స్పెషల్ సి.ఎస్. కె. విజయానంద్**

**అమరావతి, సెప్టెంబర్ 10 :** 8వ కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ఇంధన రంగానికి సంబంధించి ఎస్ఐపిబి ఆమోదించిన పెట్టుబడుల పురోగతిని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వివరిస్తూ రాష్ట్రంలో ఆమోదం పొందిన పెట్టుబడులను వేగంగా వాస్తవిక ప్రాజెక్టులుగా మార్చేందుకు జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖలు, ఎన్ఆర్ఈడిసిఎపీ నోడల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏపీ ఐసిఈ పాలసీ 2024 కింద ఇప్పటివరకు 6 ప్రాజెక్టులు రూ.11,284 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై, సుమారు 4,970 మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం 38 ప్రాజెక్టుల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, మరో 9 ప్రాజెక్టులు డీపీఆర్ ఫ్రీ పీజిబులిటీ స్టడీ దశలో ఉన్నాయని వివరించారు.

---



## స్వచ్ఛతాన్ పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి లోకేష్

**అక్టోబర్ 2న విజయవాడలో భారీస్థాయిలో నిర్వహణ**

**అమరావతి, సెప్టెంబర్ 10 :** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న విజయవాడలో భారీ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛతాన్ పోస్టర్ ని మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం రాత్రి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట పక్కన గల తమ నివాసంలో ఆవిష్కరించారు. స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌ని కూడా మంత్రి లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఈ ఈవెంట్ నిర్వహించే అమరావతిరన్నర్స్ అధ్యక్షులు రమేష్ రావి, వారి బృందం సభ్యులు పాల్గొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియమ్ వద్ద ఆ రోజు ఉదయం 5 గంటలకు స్వచ్ఛతా రన్ ప్రారంభమవుతుంది. 5కే, 10కే, 21.1కే (ఆఫ్ మేరాతన్) మూడు కేటగిరీల లో ఈ రన్ ని 'అమరావతి రన్నర్స్' వారు నిర్వహిస్తారు. బాలురు, బాలికలు, యువత.. అన్ని వయసుల వారు పాల్గొనడానికి అవకాశం కల్పిస్తారు. పాల్గొనేవారికి టీషర్ట్స్ తోపాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తారు. అన్ని విభాగాలలో విజేతలకు దాదాపు రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారు. పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి.

---

## కొండాపూర్‌లో వన్ వార్డ్ ఎవరీ డే

**-ప్రజల సమస్యలపై సీఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయి సమీక్ష**



**శేరిలింగంపల్లి, నేడు న్యూస్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ జి.శ్రీజన శేరిలింగంపల్లి జోన్‌లోని కొండాపూర్ వార్డును స్వయంగా సందర్శించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు ఆమెతో పాటు పాల్గొన్నారు. ఆఫీసు గదుల్లో కాకుండా వీధుల్లోనే ప్రజలను కలిసిన కమిషనర్, వార్డులోని ప్రధాన పౌర సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టార్మ్ వాటర్ డ్రైన్లు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కుల నిర్వహణ, ఆక్రమణల తొలగింపు, తాగునీటి సరఫరా విషయాల్లో నివాసితులు లేవనెత్తిన ఫిర్యాదులను విన్నారు. పనులు ఆలస్యం కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ప్రతిపాదిత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గణేశ్ చతుర్థి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల బదులు మట్టి విగ్రహాలను వాడాలని స్థానికులకు సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా పండుగను నిర్వహించాలని పిలుపునిస్తూ, క్షేత్రస్థాయిలోనే మట్టి గణేశ్ విగ్రహాలను పంపిణీ చేశారు. సీఎంసీ అధికారులు చెప్పిన ప్రకారం, వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమం ద్వారా 76 వార్డుల్లోనూ ప్రజల సమస్యలను నేరుగా గుర్తించి పరిష్కరించే ప్రయత్నం కొనసాగుతోంది. కొండాపూర్‌లో లేవనెత్తిన అంశాలపై తదుపరి చర్యల నివేదికను సమర్పించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

---



## వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం ముందుకు సాగుదాం

**కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, మెరుగు చంద్రమోహన్**

**కుషాయిగూడ, నేడు న్యూస్:** వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధన కోసం ప్రతిన భూని ముందుకు సాగుదామని కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, మెరుగు చంద్రమోహన్ లు పిలుపునిచ్చారు. సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41 వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆమె విగ్రహానికి సిసిఎస్ ప్రతినిధులు కాప్రా ప్రెస్ క్లబ్ పాత్రికేయులతో కలిసి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జోహార్ జోహార్ వీరవనిత చాకలి ఐలమ్మ అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు శనిగరం అశోక్, ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు బెలిదే అశోక్, పలుగుల పవన్, యావపురం రవి, రమేష్, కీర్తి శ్రీనివాస్, వెంకట్, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

---

## అర్బన్ డేటా బేస్ ఆర్టీజీఎస్‌తో అనుసంధానం

- తాగునీటికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం
- కలెక్టర్ల గత సదస్సులో తీసుకున్న నిర్ణయాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తున్నాం
- అన్ని జిల్లాల్లో భూముల లభ్యతపై ఒక సమ గ్ర వెబ్‌సైటు రూపొందిస్తున్నాం
- ముఖ్యమంత్రికి తెలిపిన అధికారులు



**అమరావతి, సెప్టెంబరు 10 :** అర్బన్ డేటా బేస్‌ను ఆర్టీజీఎస్ తో అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలిపారు. సచివాలయంలో గురువారం 8వ కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాఖల వారిగా పురోగతి నివేదికలను సమీక్షించారు. గత సదస్సుల్లో తీసుకున్న నిర్ణయాలు, వాటిపైన అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్టులపై చర్చించారు. ఇంకా పాక్షింగా పూర్తి చేయాల్సిన పనులను తక్షణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తమ తమ శాఖల్లో జరిగిన ప్రగతిని ముఖ్యమంత్రికి వివరించారు. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ డేటా బేస్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి 15 రోజుల్లో అనుమతులు వస్తాయని వచ్చిన వెంటనే ఈ డేటాబేస్‌ను ఆర్టీజీఎస్ తో అనుసంధానిస్తామని చెప్పారు. ప్రభుత్వం వద్ద ఎంత భూములున్నాయి, జిల్లాల వారీగా ఎంతెంత భూముల లభ్యత ఉందనే దానిపై సమగ్ర వివరాలతో ఒక వెబ్ సైటును రూపొందిస్తున్నట్లు సీసీఎల్ ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. భవిష్యత్తు అవసరాల కోసం ఒక కామన్ స్ట్రక్చర్డ్ ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనిద్వారా ఏపీ ప్రాంతంలో ఎంత భూమి అందుబాటులో ఉంది, ఎంత విస్తీర్ణంలో ఉంది తదితర అన్ని వివరాలు ఇందులో ప్రత్యక్షంగా తెలుసుకునే సదుపాయముంటుంది. గృహ నిర్మాణ శాఖలో గృహ నిర్మాణ పనులు ఆగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనికి సంబంధించి ఆర్థిక శాఖతో నిరంతరం సంప్రదింపులు జరిపి గృహ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేస్తామని గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు మాట్లాడుతూ మంచినీటి సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, మంచినీటి సమస్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని చెప్పా రు. దీని కోసం జిల్లాల్లో పలు అత్యవసర పనులు చేపట్టామన్నారు.

---



## జనరల్ హాస్పిటల్‌లో ప్రపంచ సూసైడ్ నివారణ దినోత్సవం

**మేడ్చల్ నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి లోని జనరల్ హాస్పిటల్‌లో గురువారం ప్రపంచ సూసైడ్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. మానసిక ఆరోగ్యం పై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. మానసిక ఆందోళనలతో బాధపడుతున్న వారిని ఆదుకోటానికి సంబంధించి ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్ ఇంటెండెంట్ డా: రాధ, ఆర్.ఎం.ఓ డా: సాయి శోభ, డా: మాధురి, డా: కిరణ్, డా: తిరుపతి, ఏవో యవన్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

---

## రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి

**జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, సెప్టెంబర్ 10 :** శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.

---

## ఈనెల 12న జాతీయ లోక్ అదాలత్

**ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషిచెయ్యాలి.**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి**



**ఏలూరు, సెప్టెంబరు 10 :** జాతీయ న్యాయసేవా అధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వారి ఆదేశాలు ప్రకారం ఈనెల 12వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి ఈరోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నందు కేసులు పరిష్కారానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, నేటి వరకు జిల్లా వ్యాప్తంగా 10,577 కేసులను రాజీయోగ్యమైన కేసులుగా గుర్తించడం జరిగిందని అన్నారు. కక్షిదారులు ప్రత్యక్షంగా గాని న్యాయవాది ద్వారా గాని సంబంధిత కోర్టులను సంప్రదించి కేసులు పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. గత జులై నెలలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ నందు 7,910 కేసులను పరిష్కరించడం జరిగిందని, కక్షిదారులు పెండింగులో ఉన్న రాజీ యోగ్యమైన కేసులను పరిష్కారానికి మరింతగా కృషిచేయవలసిందిగా సూచించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు కేసులను పరిష్కరించు కోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలియజేశారు. మరియు ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి యన్.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చమురు ధరలు 102 డాలర్ల వద్ద కొనసాగుతున్నప్పటికీ.. బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 74,742.54 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,764.23) స్వల్ప నష్టాల్లో ఆరంభమై.. ఆ తర్వాత కాస్త కోలుకుంది. రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడింది. ఇంట్రాడేలో 74,598.47- 74,910.96 మధ్య చలించింది. చివరికి 138.36 పాయింట్ల లాభంతో 74,902.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 46.30 పాయింట్లు పెరిగి 23,477.80 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.44గా ఉంది. సెన్సెక్స్30లో పవర్‌గ్రిడ్, యాక్సిస్‌బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, టెక్‌మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, టాటాస్టీల్, ట్రెంట్, ఐటీసీ, అదానీ పోర్ట్స్, బీఈఎల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 102.20 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,392.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## 11న బ్యాంకుల దేశవ్యాప్త సమ్మె..

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ బ్యాంకు యూనియన్లు సమ్మె తలపెట్టిన నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు అడ్వైజరీ జారీ చేసింది. సమ్మె కారణంగా సెప్టెంబర్ 11న బ్యాంకు సేవలు అందుబాటులో ఉండవని, అందువల్ల ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టింది. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఈ నెల 11న సమ్మె నిర్వహించనుండడంతో తమ బ్యాంకు శాఖలు మూతపడనున్నాయని ఎస్‌బీఐ తెలిపింది. నగదు అవసరాల కోసం ఏటీఎంలు, డిపాజిట్ వెండింగ్ మెషిన్లను వినియోగించుకోవాలని ఖాతాదారు లకు సూచించింది. ప్రత్యామ్నాయంగా తమ కస్టమర్ సర్వీస్ పాయింట్లనూ వినియోగించు కోవాలని తెలిపింది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఇతర డిజిటల్ వేదికలు యథావిధిగా అందుబాటులో ఉంటాయని తెలిపింది. వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు సహా పలు డిమాండ్లపై యూఎఫ్‌బీయూ సమ్మెకు పిలుపునిచ్చింది. బ్యాంకుల పనితీరు ఆధారంగా ఉద్యోగులకు చెల్లించే ప్రోత్సాహకాలను సమీక్షించాలని, ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలిపివేయాలన్న డిమాండ్లతో సమ్మె చేపడుతోంది. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మరోసారి సమ్మె చేస్తామని తెలిపింది. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాకుంటే అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని బ్యాంక్ యూనియన్లు హెచ్చరిస్తున్నాయి.



## ఆసియా కప్ ఫైనల్‌కు
# దూసుకెళ్లిన భారత్

**దుబాయ్:** మహిళల ఆసియా కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 150 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులకే పరిమితమైంది. షోర్నా అక్తర్ 22, నిగర్ సుల్తానా 19, శోభనా మోస్తరీ 18, డిలారా అక్తర్ 21, జువారియా ఫెర్డోస్ 14, ఫహీమా ఖాతున్ 14 రన్స్ చేశారు. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3, నందనీ శర్మ 2 వికెట్లు పడగొట్టారు. శ్రీచరణి, ప్రేమ రావత్ చెరో వికెట్ తీశారు. చివరి రెండు బంతులకు నందనీ శర్మ రెండు వికెట్లు తీసింది. శ్రీలంక, పాకిస్థాన్ జట్ల మధ్య శుక్రవారం రెండో సెమీఫైనల్ జరగనుంది. ఇందులో గెలిచే జట్టుతో భారత్ ఈ నెల 13న ఫైనల్‌లో తలపడుతుంది.

# దులీప్ ట్రోఫీ విజేతగా ఈస్ట్ జోన్

**చెన్నై:** దులీప్ ట్రోఫీ 2026ని ఈస్ట్ జోన్ సొంతం చేసుకుంది. చెపాక్ స్టేడియం వేదికగా సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా అవతరించింది. 13 ఏళ్ల తర్వాత ఆ జట్టు ఈ టైటిల్‌ను నెగ్గడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708 పరుగులు చేయగా, సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌట్ అయింది. ఈస్ట్ జోన్‌కు ఫాలో ఆన్ ఇవ్వకుండా రెండో






ఇన్నింగ్స్ కొనసాగించింది. 212/5తో ఐదోరోజు, గురువారం ఆటను ఆరంభించిన ఇషాన్ కిషన్ టీమ్.. 388/7 పరుగులు చేసింది. 26 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో గురువారం బ్యాటింగ్ కొనసాగించిన కౌనైన్ ఖురేషి (116) శతకం సాధించాడు. మ్యాచ్‌లో ఫలితం అవకాశం లేకపోవడంతో డ్రాగా ముగిసినట్లు ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. మ్యాచ్ ముగిసిన అనంతరం ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ మైదానంలో డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.

# భారత్‌తో సిరీస్ కోసం..
## బిగ్‌బాష్ లీగ్‌ను వదులుకున్న శాంట్నర్

దెస్క్: న్యూజిలాండ్ పరిమిత ఓవర్ల క్రికెట్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు వచ్చిన కాంట్రాక్ట్‌ను వద్దని తిరస్కరించాడు. 'నేషన్ ఫస్ట్' అని అంతర్జాతీయ మ్యాచుల కోసం సన్నద్ధమయ్యేందుకు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. బీబీఎల్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ జట్టు శాంట్నర్‌కు ఆఫర్ ఇచ్చింది. అయితే, భారత్‌తో పాటు ఆస్ట్రేలియాతో సిరీసులు ఉన్న నేపథ్యంలో తాను అందుబాటులో ఉండనని శాంట్నర్ బదులిచ్చాడు. "మాకు ఇప్పుడు వసంతకాలం. రాబోయే సమ్మర్‌లో భారత జట్టు మాతో సిరీస్‌లను ఆడేందుకు రానుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనకు మేం వెళ్తాం. అంతర్జాతీయ మ్యాచుల కంటే ఏదీ ఎక్కువ కాదు. ఇది మాకు అత్యంత కీలకమైన సమయం. అందులో నేనూ భాగం కావాలని అనుకుంటున్నా. బీబీఎల్ నుంచి వచ్చిన ఆఫర్ బాగుంది. అందులో దాచేందుకు ఏమీ లేదు. కానీ, నేను కివీస్ తరఫున ప్రతి మ్యాచ్‌నూ ఆడాలని అనుకుంటున్నా. అందుకు సన్నద్ధం కావాల్సి ఉంది" అని శాంట్నర్ తెలిపాడు. మరోవైపు బిగ్‌బాష్, దక్షిణాఫ్రికా టీ20 లీగ్ జరిగే సమయంలోనే న్యూజిలాండ్ వేదికగా సూపర్ స్మాష్ టీ20 లీగ్ కూడా ఉంటుంది. కివీస్‌కు చెందిన కాంట్రాక్ట్ ప్లేయర్లలో పలువురు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. న్యూజిలాండ్‌తో భారత్ మూడు ఫార్మాట్లలోనూ మ్యాచులను ఆడేందుకు అక్టోబర్‌లో పర్యటించనుంది. దాదాపు నెలన్నర రోజులపాటు సాగనుంది.



ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టుల్లో టీమ్‌ఇండియా - కివీస్ తలపడతాయి. ఈ సిరీస్‌లు ముగిసిన తర్వాత.. న్యూజిలాండ్ వెంటనే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఆ జట్టుతో నాలుగు టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. జనవరి తొలి వారం వరకూ బిజీ షెడ్యూల్‌తో కివీస్ గడపనుంది.



## వచ్చే ఏడాది జులైలోగా..
## పైలట్లందరికీ డ్రగ్ పరీక్షలు : డీజీసీఏ

అన్ని విమానయాన సంస్థల పైలట్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది. వచ్చే ఏడాది జులై నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఎయిర్‌లైన్లకు సూచించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, పైలట్ల డ్రగ్ పరీక్షలకు సంబంధించిన కొత్త నిబంధనల ముసాయిదాను సంబంధిత వర్గాలతో చర్చల అనంతరం ఈ నెలాఖరులోగా డీజీసీఏ ఖరారు చేసే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు. గత నెలలో థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానం గాల్లో తీవ్ర కుదుపులకు లోనుకావడంతో 24 మంది ప్రయాణికులు గాయపడిన విషయం తెలిసిందే. అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రాథమిక పరీక్షలో పైలట్-ఇన్-కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. అనంతరం సైకోయాక్టివ్ పరీక్షను నిర్వహించగా.. గంజాయి తీసుకున్నట్లు నిర్ధరణ అయ్యింది. దీంతో ఆ పైలట్‌ను ఎయిరిండియా విధుల నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలోనే అన్ని విమానయాన సంస్థల పైలట్లకు డ్రగ్ పరీక్షలు నిర్వహించాలంటూ డీజీసీఏ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. భారత్‌లో వివిధ విమానయాన సంస్థల్లో 12 వేలమందికి పైగా పైలట్లు ఉన్నారు. ప్రస్తుతం పైలట్లకు ర్యాండమ్ పద్ధతిలో డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీజీసీఏ సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్ ప్రకారం.. ఏటా 10 శాతం మంది పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు తదితరులకు ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. థాయ్‌లాండ్- దిల్లీ విమాన ఘటన నేపథ్యంలో.. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లలోని పైలట్లందరికీ డ్రగ్ టెస్టులు నిర్వహించాలని ఎయిరిండియా గ్రూప్ ఇప్పటికే నిర్ణయించింది.



## టార్గెట్ అజిత్ అగార్కర్..
## రోహిత్ శర్మ 'టీ షర్ట్' వైరల్


భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మైదానంలో ఎంత సరదాగా ఉంటాడో, గ్రౌండ్ వెలుపల కూడా అంతే చలాకీగా ఉంటాడు. తోటి ఆటగాళ్లు, ఫ్రెండ్స్‌తో జాలీగా ఉంటూ తనదైన స్టైల్‌లో పంచ్‌లు విసురుతుంటాడు. అప్పుడప్పుడు అవి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తాయి. తాజాగా రోహిత్ సైలెంట్‌గా వేసిన ఓ కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. టీమ్‌ఇండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ఉద్దేశించే ఈ కౌంటర్ ఇచ్చాడని నెటిజన్లను చర్చించుకుంటున్నారు. ఇంతకీ అసలు విషయం ఏంటంటే.. సెప్టెంబరు 19 నుంచి బుల్లి తెరపై ప్రసారం కానున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే ఎంటర్‌టైన్‌మెంట్ షో ద్వారా హోస్ట్‌గా హిట్‌మ్యాన్ కొత్త అవతారం ఎత్తబోతున్నాడు. ఈ షోకు సంబంధించిన ప్రోమో షూటింగ్ సమయంలో రోహిత్ వైట్ కలర్ టీ షర్ట్ ధరించి కెమెరాతో మాట్లాడాడు. ఆ టీ షర్ట్‌పై కమిట్‌మెంట్ లేదా? అని రాసి ఉంది. నోటితో ఏమీ అనకపోయినా ఈ కోట్‌తో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను రోహిత్ టార్గెట్ చేశాడని నెట్టింట అభిమానులు చర్చించుకుంటున్నారు. గతేడాది అక్టోబర్‌లో శుభ్‌మన్ గిల్‌ను వన్డే కెప్టెన్‌గా ప్రకటించినప్పుడు రోహిత్, విరాట్ కోహ్లీ 2027 ప్రపంచ కప్ ఆడే విషయంలో కమిట్మెంట్‌తో లేరని అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించాడు. దానికి ఫిబ్రవరిలోనే రోహిత్ ఓ కౌంటర్ ఇచ్చాడు. దేశం తరఫున ట్రోఫీలు గెలవాలనే కమిట్మెంట్, ఆకలి తమకు పుష్కలంగా ఉన్నాయన్నాడు. ఇప్పుడు డైరెక్ట్‌గా అజిత్ అగార్కర్ ఉపయోగించిన ఆ పదాన్నే టీ షర్ట్‌పై ముద్రించుకుని రోహిత్ మరోసారి వార్తల్లో నిలిచాడు.

## జూనియర్ హాకీ ఆసియాకప్:
### పాక్ చిత్తు.. సెమీస్‌లో భారత్

పాకిస్థాన్‌ను టీమ్‌ఇండియా చిత్తు చేసింది. అదేంటి ఇప్పుడేం మ్యాచ్ అంటారా? జూనియర్ మహిళల హాకీ ఆసియా కప్‌లో భారత జట్టు విజృంభించింది. క్వార్టర్ ఫైనల్స్‌లో 19-0 తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. చైనా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత ప్లేయర్ల ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోయింది. గ్రూప్ స్టేజ్‌లో జపాన్, మలేషియా, దక్షిణ కొరియాను ఓడించిన భారత్.. చైనాతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇప్పుడు క్వార్టర్స్‌లో పాక్‌పై గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. దక్షిణా కొరియా - మలేషియా పోరులో విజేతగా నిలిచే టీమ్‌తో భారత్ సెమీఫైనల్‌లో తలపడనుంది. భారత యువ ప్లేయర్ పూజ ఏడో నిమిషంలోనే గోల్ కొట్టింది. ఆ తర్వాత సానికా మనె మరో రెండు గోల్స్ చేసింది. సగం సమయానికే భారత్ 10-0 లీడ్‌లోకి వెళ్లిపోయింది. మాలిక్ హ్యాట్రిక్‌తో రెండో అర్ధభాగంలోనూ టీమ్‌ఇండియాదే హవా. పాక్ నుంచి కనీస పోరాటం కూడా లేదు. ఆ జట్టు ఒక్కసారి కూడా గోల్ పోస్టు వైపు రాలేకపోయింది. ఇప్పటికే 2023, 2024 సీజన్లలో ఆసియా కప్‌ను గెలిచిన టీమ్‌ఇండియా.. హ్యాట్రిక్‌పై గురి పెట్టింది.

# ఫిక్సింగ్ ఆరోపణలు..
## రిజ్వాన్ - ఇమామ్‌కు సైబర్ క్రైమ్ నోటీసులు

ఇంగ్లాండ్‌తో తొలి రెండు టెస్టుల్లో ఘోర పరాభవం తర్వాత ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను పాక్ మేనేజ్‌మెంట్ స్వదేశానికి పిలిపించింది. తాజాగా అందులో ముగ్గురికి పాకిస్థాన్ జాతీయ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అందులో మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ కాగా.. మరొకరు ఎవరనేది తెలియాల్సి ఉంది. వీరందరి ఫోన్ డేటాపై విచారణ జరిపేందుకు సమన్లు జారీ చేసినట్లు సమాచారం. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు పలువురిపై ఆరోపణలు వచ్చాయి. మరీ ముఖ్యంగా రెండో టెస్టు తుది జట్టుకు ఎంపికైన ఇమామ్ ఉల్ హక్ కండరాలు పట్టేయడంతో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ, బ్యాటింగ్‌కు సిద్ధమవుతున్నట్లుగా కెమెరాల్లో మాత్రం కనిపించాడనే విమర్శలు వచ్చాయి. ఇమామ్ ఉల్ హక్ మాజీ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హక్ మేనల్లుడు. ఇక రిజ్వాన్ కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కలిపి 8 పరుగులే చేశాడు. ఆ టెస్టు ముగిసిన తర్వాత వారి ఫోన్లను పాక్ సెక్యూరిటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులోని డేటాను కూడా ట్రాన్స్‌ఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. పేలవ ప్రదర్శనపై విమర్శలు




రావడంతో ఆఖరి టెస్టు ఉండగానే స్వదేశానికి బోర్డు పంపించింది. ఆ సమయంలో పాక్ మీడియా మాత్రం 'ఇమామ్, రిజ్వాన్‌పై పీసీబీ విచారణ చేపట్టనుంది. ప్రదర్శన విషయంలోనే అంతర్గతంగా విశ్లేషించనుంది' అని పేర్కొంది. తాజాగా సైబర్ క్రైమ్ నోటీసులతో ఈ సమస్య మరింత తీవ్రమైందని క్రికెట్ వర్గాలు అంటున్నాయి.




## ఫ్లిప్‌కార్ట్ 'బిగ్ బిలియన్ డేస్'
# తేదీలు వచ్చేశాయ్

ఆఫర్ల పండగ కోసం వేచిచూస్తున్న వారికి గుడ్‌న్యూస్. ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ 'బిగ్ బిలియన్ డేస్ 2026' సేల్ తేదీలను ప్రకటించింది. అక్టోబర్ 9వ తేదీ నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. అక్టోబర్ 8న ప్లస్ మెంబర్లకు అందుబాటులోకి రానుంది. ఎప్పటివరకు అనేది మాత్రం వెల్లడించలేదు. గతేడాది సెప్టెంబర్ 23న సేల్ నిర్వహించగా.. ఈసారి రెండు వారాల ఆలస్యంగా ప్రారంభం కానుంది. బిగ్ బిలియన్‌డేస్ సేల్‌లో భాగంగా ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై 10 శాతం డిస్కౌంట్ లభించనుంది. ప్లస్ మెంబర్లకు ఈసారి బ్యాంక్ ఆఫర్ కింద 12 శాతం డిస్కౌంట్ అందిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ తన అధికారిక పేజీలో పేర్కొంది. ప్రైస్ క్రాష్, బీబీడీ స్పెషల్, స్టీల్ డీల్, బ్రాండ్ అవర్స్, డబుల్ డిస్కౌంట్, రష్ అవర్స్ పేరుతో వివిధ రకాల సేల్స్ నిర్వహించనున్నట్లు తన మైక్రోసైట్‌లో పేర్కొంది. సేల్ తేదీలు దగ్గర పడ్డాక ఆఫర్ల వివరాలు వెల్లడి కానున్నాయి.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com